వైకల్యం.. కాదు అడ్డు

సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం క్రీడలను ప్రారంభించి, పోటీలను తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారి, డీవైఎస్‌వో ఖాసీంబేగ్, దివ్యాంగ్ సోలార్ సొసైటీ అధ్యక్షురాలు జుబేదా, సాయికుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

-సంగారెడ్డి అర్బన్, (ఆంధ్రజ్యోతి)








బల్దియాలో బడ్జెట్ నిల్

మెదక్ మున్సిపాలిటీ కుదేలు



దశాబ్దాలుగా పేరుకుపోయిన బకాయిలు

ప్రభుత్వ ప్రాపర్టీ టాక్స్ రూ.6 కోట్లు పెండింగ్

ప్రైవేటు ఆస్తుల పన్ను రూ 3 కోట్లు బకాయిలు

జనరల్ ఫండ్ నిల్వలు సున్నా.. సిబ్బంది జీతాలకూ కటకట

మెదక్ బల్దియా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కోట్లాది రూపాయల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వ భవనాల ప్రాపర్టీ ట్యాక్స్ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ప్రైవేటు ఆస్తులపైనా రూ. కోట్లలో పన్నులు వసూలు కావాల్సి ఉంది. మున్సిపాలిటీ జనరల్‌ఫండ్ లేక.. ప్రభుత్వ గ్రాంట్లు రాక ఖజానా నిండుకున్నది. శానిటేషన్, నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ వంటి కనీస సౌకర్యాలకు కూడా నిధులు కరువయ్యాయి. సిబ్బంది జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొన్నది.

మెదక్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ పురపాలక సంఘానికి ఆస్తిపన్ను, నల్లా బిల్లులు, ఇతర పన్నుల రూపంలో ఏటా రూ.15 కోట్లు ఆదాయం సమకూరుతుంది. విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు, అభివృద్ధి పనులకు, అత్యవసర పనులకు ఈ నిధులను వినియోగిస్తుంటారు. పన్నుల వసూలు కోసం ప్రత్యేకంగా రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బకాయిదారులకు డిమాండ్ నోటీసులు అందజేస్తారు. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతీ ఏటా ఆస్తిపన్ను చెల్లించాలంటూ డిమాండ్ నోటీసు అందజేయడం, ఆ తర్వాత ఊరుకోవడం రివాజుగా వస్తోంది. ప్రైవేటు ఆస్తుల పన్ను వసూళ్లలో వ్యవహరించే రీతిగా ప్రభుత్వ టాక్స్ వసూలులో

మిగతా 8వ పేజీలో..

పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్

మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ కొరత తీవ్రంగా ఉంది. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలు చేస్తాం. కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించడంలో ఏర్పడుతున్న ఇబ్బందులను అధిగమిస్తాం. ప్రభుత్వ కార్యాలయ భవనాల ఆస్తి పన్ను వసూలు కోసం డిమాండ్ నోటీసులు అందజేయాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం.



-శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ కమిషనర్

ఉమ్మడి జిల్లాపై చలి పంజా

కోహీర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

మెదక్ అర్బన్/కోహీర్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత శీతాకాలంలో మొదటిసారిగా ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. మంగళవారం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 9.5 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 9 నుంచి 12 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటిందంటే గజ గజ వణికిస్తోంది. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని న్యాల్కల్ 11.1, మాల్చెల్మ 11.2, అల్మాయిపేట 11.3, అల్గోల్ 11.4 కంగ్టి అన్నాసాగర్ 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలోని శివ్వంపేట 11.5, కొత్తపేట 11.8, డి.ధర్మారం 11.9 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్ 11.5, కొండపాక, పోతారెడ్డిపేట 11.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శీతలగాలుల ప్రభావంతో వాతావరణం పూర్తిగా చల్లబడి చలి పెరిగిందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు. చలి తీవ్రత మరో వారం రోజుల వరకు కొనసాగవచ్చని తెలిపారు. ఉదయం వేళ పొగమంచు కమ్మేస్తోంది. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. వేకువజామున పనులకు వెళ్లే పారిశుధ్య కార్మికులు, పేపర్‌బాయ్‌లు, పాల వ్యాపారులు చలితో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



చలిమంట వేసుకున్న మునియార్‌పల్లి వాసులు



సీతానగర్‌లో ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న తహసీల్దార్

సీతానగర్‌లో ధాన్యం తూకం షురూ

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన అధికారులు
- నెల రోజుల అనంతరం వడ్ల కొనుగోళ్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లాదుర్గం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీతానగర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం ప్రారంభించారు. కేంద్రాన్ని ప్రారంభించి నెల కావస్తున్నా రైతుల నుంచి ధాన్యం సేకరించకపోవడంపై ఈ నెల 18న 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో ప్రచురితమైన 'కొనుగోలు కేంద్రాలు తెరిచారు సరే.. తూకం వేసేదెప్పుడు.?' అనే వార్తా కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో నెల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు రైతుల నుంచి వడ్లు కొనకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. రైతుల గోసను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో మంగళవారం తహసీల్దార్ సీతానగర్ గ్రామాన్ని సందర్శించి కొనుగోలు కేంద్రంలో తూకం ప్రారంభించారు. త్వరతగతిన కొనుగోలు పూర్తిచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. నెల రోజుల నిరీక్షణ ఫలించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

- ప్రభుత్వ పథకాలపై కళాయాత్ర ద్వారా ప్రచారం
- ప్రారంభించిన మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని మంగళవారం కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలతోపాటు 21 మండలాల్లోని ఆయా గ్రామాల్లో వచ్చే నెల 7వ తేదీ వరకు ప్రభుత్వ ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వైద్య కళాశాల పరిశీలన

మెదక్ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో వైద్యకళాశాలలో పారా మెడికల్ డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ అనస్తీసియా టెక్నీషియన్ కోర్సులకు అనుమతి వచ్చిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్‌లోని వైద్య కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. వైద్య కళాశాలలో పారా మెడికల్ సిబ్బంది ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారని ఈనెల 25 లోపు కౌన్సెలింగ్ నిర్వహించి రిక్రూట్‌మెంట్ చేయాలని సూపరిండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమలాదేవి తదితరులుపాల్గొన్నారు.

చనిపోయి ఆరేళ్లు.. ఎఫ్ఐఆర్‌లో పేరు

విచారించకుండానే చేర్చిన పోలీసులు

నర్సాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ భూ వివాదంపై వచ్చిన ఫిర్యాదుపై ముందస్తు విచారణ చేయకుండానే ఆరు సంవత్సరాల క్రితం చనిపోయిన వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు నర్సాపూర్ పోలీసులు. స్థానికంగా ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చిరాం తండాకు చెందిన ఓ భూమికి సంబంధించి నర్సాపూర్ వాస్తవ్యుడు శ్రీనివాస్‌కు తండాకు చెందిన గిరిజనులతో వివాదం కొనసాగుతున్నది. తన భూమిలోకి వచ్చి బెదిరిస్తున్నారని, దౌర్జన్యం చేస్తున్నారని తండాకు చెందిన దేవీసింగ్, సూర్య, అంజనేయులు, విఠల్‌పై శ్రీనివాస్ సెప్టెంబరు 23న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మరుసటి రోజు ఎస్ఐ లింగం నలుగురి పేర్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎఫ్ఐఆర్‌లో పేరున్న విఠల్ కుటుంబీకులకు ఫోన్‌చేసి ఆయనపై కేసు నమోదైందని, విచారణ కోసం స్టేషన్‌కు రావాలని సమాచారమిచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. విఠల్ అనే వ్యక్తి ఆరు సంవత్సరాల క్రితమే గుండెపోటుతో చనిపోయాడని, ఫిర్యాదు వస్తే గుడ్డిగా ఎవరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేధిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ లింగంను వివరణ కోరగా ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని, ఛార్జిషీట్ వేసే సమయంలో చనిపోయిన వ్యక్తి పేరును తొలగిస్తామని సమాధానమిచ్చారు.



మృతుడు విఠల్ ఫొటో, డెత్‌సర్టిఫికెట్‌ను చూపుతున్న కుటుంబం సభ్యులు

శభాష్ రమేష్

- కౌలు భూమిలో సేంద్రియ సాగు
- ఐదేళ్లుగా కూరగాయలు పండిస్తున్న యువరైతు
- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి
- సంతల్లో నేరుగా విక్రయం

7



సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న హెల్ప్‌డెస్క్

బాల వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయే

రేపటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించటమే లక్ష్యంగా నిర్వహించే బాల వైజ్ఞానిక ప్రదర్శన సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ వేదికగా ఈ నెల 21, 22, 23వ తేదీల్లో జరగనుంది. బాల వైజ్ఞానిక ప్రదర్శనతో(2024-25) పాటు ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనకు(2023-24) విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. 'సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతిక(సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేయినబుల్ ఫ్యూచర్) అనే ప్రధాన అంశంపై ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఇందులో ఏడు ఉప అంశాలు (సబ్ థీమ్స్) ఉంటాయి. వైజ్ఞానిక ప్రదర్శన కోసం ప్రధానోపాధ్యాయులతో 11 కమిటీలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 830 విద్యార్థుల ఎగ్జిబిట్లు, 12 టీచర్ ఎగ్జిబిట్లను ప్రదర్శన కోసం నమోదుకు చేసుకున్నారు. జిల్లా స్థాయిలో 95 ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వరద కాలువపై అపార్ట్‌మెంట్ల నిర్మాణం
- ప్రమాదకరంగా కోతకు గురైన కొల్లూరు-వెలిమెల రోడ్డు
- గాయాల పాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

8





రోడ్లపై ధాన్యాన్ని వెంటనే తరలించాలి

● తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

మనోహరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు రోడ్లపై పోసిన ధాన్యాన్ని వెంటనే తొలగించాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కేంద్రంలోని దండుపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని రైతులు వెంటనే తీసేయాలన్నారు. కొనుగోలు సిబ్బందితో మాట్లాడుతూ వారంరోజుల్లో రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని సూచించారు. ధాన్యం రోడ్లపై పోయడంతో ప్రయాణికులకు రాత్రివేళల ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. వారంరోజుల్లో రోడ్డుపై పోసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి రైతులకు తెలియజేశారు. ఆయన వెంట తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

'ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలి'

సంగారెడ్డి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబరు నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలు ఎత్తివేయాలని, వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేఎంపీఎల్ తేవాలని అధికారులు డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు యాదిగిరి, బాబురావు, అశోక్, శివ, మహేశ్, వెంకటేశ్, రాజు, రాజేష్, నర్సింహులు, లక్ష్మయ్య, నరేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.











వైభవంగా రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



కందిలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కంది, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కందిలోని రుక్మిణీ పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు సునీల్ దేశ్‌ముఖ్, దీపక్ దేశ్‌ముఖ్ పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం, అంకురార్పణ నిర్వహించారు. రాత్రి ఎదుర్కోళ్లు, బలిహరణం జరిగాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం, గురువారం గరుడసేవ, ఊరేగింపు, గోపాల కాలువ కార్యక్రమాలు, శుక్రవారం రథోత్సవం అనంతరం వారంరోజుల పాటు జాతర ఉంటుంది.

25న భూలక్ష్మీ అఖండ కోటి దీపారాధన

వట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి మండలం దుద్యాల గ్రామంలో గల శ్రీగిరి శేషాద్రినాథ హరిహర మహాక్షేత్రం సర్వేశ్వరాపురంలో ఈనెల 25న భూలక్ష్మీ అఖండ కోటి దీపారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

గోకర్ణేశ్వర ఆలయంలో కల్యాణోత్సవం



రేగోడు గోకర్ణేశ్వర ఆలయం

రేగోడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని రేగోడు గోకర్ణేశ్వర, వీర హనుమాన్ ఆలయంలో బుధవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్నామని, ఇందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పూజారి మహేష్‌స్వామి తెలిపారు. ఈ కల్యాణాన్ని కల్లేటి సంధ్యారాణిఅశోక్ కుమార్, మునిగ్యాల వసుంధర శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు పోచమ్మతల్లి ఆలయ చతుర్థ వార్షికోత్సవం

కొండాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలం గొల్లపల్లిలోని పోచమ్మతల్లి ఆలయ చతుర్థ వార్షికోత్సవాలను జరుపుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి పూజ పుణ్యాహవాచనం మొదలుకొని అమ్మవారికి పంచామృత అభిషేకం, మూలమంత్ర, పూర్ణాహుతి హోమాలను నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.





శభాష్ రమేష్

- కౌలు భూమిలో సేంద్రియ సాగు
- ఐదేళ్లుగా కూరగాయలు పండిస్తున్న యువరైతు
- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి
- సంతల్లో నేరుగా ప్రజలకు విక్రయం

ఇంటర్ వరకు చదువుకున్న అతడు ఒకరి కింద పని చేయడం ఇష్టం లేక వ్యవసాయాన్ని ఎంచుకున్నాడు. సొంత భూమి లేకున్నా.. కౌలుకు తీసుకుని మరీ సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. గత ఐదేళ్లుగా రెండు ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నాడు. దిగుబడులను సైతం దళారులపాలు చేయకుండా ఎక్కడ సంత జరిగితే అక్కడికి వెళ్లి తానే నేరుగా అమ్ముతున్నాడు. దీంతో ఇటు రైతుకు.. అటు వినియోగదారులకు మేలు జరుగుతుందని అంటున్నాడు ఆ యువరైతు. సేంద్రియ పద్ధతిలో పండించిన తాజా కూరగాయలను తక్కువ ధరలకు అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు రైతు కుందెన రమేష్.



అక్కన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామానికి చెందిన కుందెన రమేష్ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ఐదేళ్ల క్రితం గ్రామంలోనే ఎకరానికి రూ.10 వేల చొప్పున, రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు మొదలుపెట్టాడు. తక్కువ పెట్టుబడితో పంటలు సాగుచేస్తూ మంచి ఆదాయం పొందుతున్నాడు.

అన్ని రకాల కూరగాయలు..

టమాట, బెండకాయ, కాకరకాయ, చిక్కుడుకాయ, బీరకాయ వంటి అన్ని రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. వీటికి ఎలాంటి రసాయనిక ఎరువులు, మందులు పిచికారి చేయకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం బెండ, చిక్కుడు, టమాట, కాకర తోటలు వేశాడు. పండించిన తాజా కూరగాయలను అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లోని గ్రామాలతోపాటు ఎక్కడ సంత జరిగితే అక్కడికి తీసుకెళ్లి దళారులకు విక్రయించకుండా తానే సొంతంగా తక్కువ ధరలకే అమ్ముతున్నాడు. దీంతో నిమిషాల్లోనే అన్ని కూరగాయలు అమ్ముడవుతున్నాయని ఆయన చెబుతున్నాడు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

తక్కువ ఖర్చుతో కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు యువరైతు రమేష్. డ్రిప్ సిస్టం ద్వారా నీరు అందిస్తూ సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తున్నాడు. ఎలాంటి ఎరువులు, రసాయనిక మందులు వాడకపోవడంతో చాలావరకు పెట్టుబడి ఆదా అవుతుందని, సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి కూడా వస్తుందని చెబుతున్నాడు.



ఒకరి కింద పని చేయడం ఇష్టం లేక..

ఇంటర్ వరకు చదువుకున్నాను. ఒకరి కింద పనిచేయడం ఇష్టం లేక కూరగాయల సాగును ఎంచుకున్నా. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తుండడంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుంది. కష్టానికి తగిన ఫలితం వస్తుండడంతో సంతోషంగా ఉంది.

-కుందెన రమేష్, యువరైతు, కుందనవానిపల్లి, అక్కన్నపేట మండలం

రెండున్నర ఎకరాల్లో సాగు చేశా



యాసంగిలో జీరో టిల్లేజీ పద్ధతి ద్వారా మొక్కజొన్న సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుంది. గత మూడు సంవత్సరాలుగా ఇదే పద్ధతిలో సాగు చేస్తున్నాం. దున్నుడు ఖర్చు తప్పుతుంది. విత్తనాలు, ఎరువులు కూడా తక్కువగానే పడుతున్నాయి. ఎకరాకు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

-గుగులోతు బక్షీనాయక్, రైతు, కేశనాయక్‌తండా, అక్కన్నపేట మండలం

పెట్టుబడి ఆదా అవుతుంది..



ప్రస్తుతం వరికోతలు కోసిన రైతులు అదే పొలంలో దుక్కి దున్నకుండానే జీరో టిల్లేజీ పద్ధతి ద్వారా మొక్కజొన్న సాగు చేయవచ్చు. దీంతో సమయం ఆదాతో పాటు పెట్టుబడి తక్కువ అవుతుంది. పంట దిగుబడి అధికంగా వస్తుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

-తస్లీమా సుల్తానా, అక్కన్నపేట మండల వ్యవసాయధికారి,

స్ఫూర్తి..

దున్నకుండానే మక్క సాగు

- జీరో టిల్లేజీ పద్ధతిలో పంట
- ఖర్చు, నీరు ఆదా.. అధిక దిగుబడి
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

అక్కన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు మక్కజొన్న సాగుపై మక్కువ చూపుతున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో రైతులు జీరో టిల్లేజీ పద్ధతిలో ముక్కజొన్న సాగు చేస్తున్నారు. పెట్టుబడి తక్కువ అధిక దిగుబడి వస్తుండడంతో మెట్ట ప్రాంతమైన అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో రైతులు జీరో టిల్లేజీ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

జీరో టిల్లేజీ సాగు పద్ధతి...

వరి పంట కోసిన తర్వాత దుక్కి దున్నకుండానే నీరు పెట్టి పొలాన్ని తడుపుతారు. అనంతరం తాళ్లతో రెండు వైపులా కొయ్యలు పాతి తాళ్ల లైన్‌లో మక్కజొన్న విత్తనాలు నాటుతారు. దీంతో దుక్కి దున్నుడు, కూలీలకు డబ్బులు తప్పుతాయి. విత్తనాలు తక్కువ మోతాదులో వేయడం వల్ల విత్తనాలు కూడా ఆదా అవుతాయి. ఎరువులు సైతం తక్కువ మోతాదులో వేయాల్సివస్తుంది. ఎకరాకు రూ.10 వేల వరకు ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడి వస్తుంది. తక్కువ నీటితో మొక్కజొన్న పంట పూర్తవుతుంది.



క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



బక్కప్ప (ఫైల్)

అల్లాదుర్గం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చేవెళ్ల గ్రామానికి చెందిన మేడికుంద బక్కప్ప (38) ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతడి భార్య రుక్మిణి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మంగళవారం గ్రామానికి చెందిన సంతోష్ పొలంలో కూలీలు పత్తి ఒలుస్తుండగా బక్కప్ప మృతదేహం కనిపించింది. సమాచారం అందుకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమర్టానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ దగ్ధం



దగ్ధమవుతున్న హార్వెస్టర్

వర్గల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ దగ్ధమైన సంఘటన వేలూరులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలో రైతు ఉప్పరి రామస్వామికి చెందిన వ్యవసాయ పొలంలో మంగళవారం అదే గ్రామానికి చెందిన శ్రీశైలంకు చెందిన హార్వెస్టర్‌తో వరికోత చేపడతున్నారు. ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్తు వైర్లు దానికి తగలడంతో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన డ్రైవర్ వెంటనే కిందకు దూకాడంతో ప్రమాదం తప్పింది. రైతులు మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నం విఫలమవడంతో మిషన్ పూర్తిగా దగ్ధమైంది.

ద్విచక్రవాహనం పైనుంచి జారిపడి మహిళ మృతి



పద్మావతి(ఫైల్)

మర్కుక్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మర్కుక్ మండలం గణేష్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్ర పద్మావతి(49) తన కొడుకు భాస్కర్‌రెడ్డితో మంగళవారం ఉదయం గజ్వేల్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు పద్మావతి ద్విచక్ర వాహనం పై నుంచి జారి కిందపడింది. తీవ్ర గాయాలైన ఆమెను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బకాయి వేతనాలు ఇప్పించాలి

- ప్రిన్సిపాల్ లింగారెడ్డికి గురుకుల సిబ్బంది వినతి

నారాయణఖేడ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మూడు నెలల బకాయి వేతనాలను ఇప్పించాలని ఖేడ్ శివార్లలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకులం పాఠశాల, కళాశాల పార్ట్‌టీం టీచర్లు, అధ్యాపకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ లింగారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. వేతనాలు రాక కుటుంబ పోషణ భారమవుతుందని పేర్కొన్నారు. గురుకులానికి రావడానికి వాహనంలో పెట్రోలు పోయించుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. విద్యార్థులకు అన్యాయం జరుగకూడదని తాము విధులు నిర్వరిస్తున్నామని తెలిపారు. వేతనాలు చెల్లించని పక్షంలో విధులకు హాజరు కాబోమని స్పష్టం చేశారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



సిద్దిపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేట కోమటి చెరువు కట్టపై మంగళవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శివ లింగానికి భక్తులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం దీపాలు వెలిగించి కోమటి చెరువులో వదిలారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. విరధర్మ పీఠాధిపతులు కార్యక్రమానికి హాజరై ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



జనగణనలోనే కులగణన చేపట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ నందగోపాల్



సమరభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం కోర్ కమిటీ

మెదక్ అర్బన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జనగణనలో కులగణన కూడా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ నందగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 25న రవీంద్రభారతిలో నిర్వహించే సమరభేరి పోస్టర్‌ను సంఘం కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బీసీ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. బీసీకు సామాజిక రక్షణ, భద్రత కల్పించేందుకు బీసీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమరభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రక్షక దళ చైర్మన్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో కలిసి నియామకపత్రాన్ని అందుకుంటున్న పల్లె వరుణ్‌కుమార్ (ఫైల్)

ఒకేసారి మూడు ఉద్యోగాలు

జహీరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో ఉన్న పోటీకి తట్టుకుని పరీక్షల్లో నెగ్గి ప్రభుత్వ కొలువులు సాధించడం కష్టమే. కానీ, లక్ష్యం చేరుకునే వరకూ పట్టువిడవకుండా రేయింబవళ్లు కష్టపడి చదివి ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లికి చెందిన పల్లె వరుణ్‌కుమార్. 2022లో రవాణా శాఖలో ఏఎంవీఐ, ఇరిగేషన్ శాఖలో ఏఈ, ఏఈఈల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడగా, 2023లో పరీక్షలు జరిగాయి. దీనికి సంబంధించి ఒక్కొక్కటిగా ఇటీవల ఫలితాలు వెలువడగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. చివరకు ఏఎంవీఐ ఉద్యోగంలో చేరేందుకు ఈ నెల 11న రవాణాశాఖ ఉన్నతాధికారుల నుంచి నియామకపత్రం అందుకున్నాడు. అంతేకాకుండా ఏఎంవీఐ, ఏఈ ఫలితాల్లో రాష్ట్రంలోనే రెండో ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు. దీంతో స్థానికుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గౌరవప్రదమైన హోదాలో ఉండాలనే ఆకాంక్షతో పట్టుబట్టి చదివి గెజిటెడ్ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉందని, తన చదువంతా జహీరాబాద్, హైదరాబాద్‌లోనే సాగిందని ఈ సందర్భంగా పల్లె వరుణ్‌కుమార్ తెలిపారు.

బాలల కేసుల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

- జిల్లా బాలల న్యాయమండలి సభ్యుడు వాసు

మెదక్, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు సంబంధించిన కేసుల విషయంలో పోలీసు సిబ్బంది, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు మానవతా దృక్పథంతో నడుచుకోవాలని జిల్లా బాలల న్యాయ మండలి సభ్యుడు వాసు అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మంగళవారం మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీ శారదను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ బోర్డు (పిల్లల సంరక్షణ ,రక్షణ) చట్టంలో భాగంగా నేరారోపణతో నిర్బంధించబడిన పిల్లలను జువైనల్ జస్టిస్ బోర్డు ముందు ప్రవేశపెట్టాలే కానీ సాధారణ క్రిమినల్ కోర్టు ఎదుట హాజరు పర్చకూడదని సూచించారు. పిల్లలను వారి నేర కార్యకలాపాల వ్యవహారాలతో దోషిగా నిందించకూడదన్నారు. పలు కారణాల వల్ల తల్లిదండ్రులు తమకు పుట్టిన పిల్లల పోషణ భారమై శిశువులను పారవేయడం, లేదా వదిలివేయడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారికోసం ప్రభుత్వం శిశు గృహ ఏర్పాటు చేసిందన్నారు.

సారూ.. మీ జాడెక్కడ?

- సర్వే సాకుతో ఇటు కార్యాలయం, అటు సర్వే రెండింటికీ డుమ్మా..
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



మూసి ఉన్న గది తలుపు



ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీవో కుర్చీ

వెల్దుర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి). సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడితే పర్యవేక్షించాల్సిన అధికారులు విధులకు గైర్హాజరు అవుతున్నారు. వెల్దుర్తి మండల ఎంపీడీవో మంగళవారం మధ్యాహ్నం వరకు కార్యాలయానికి రాలేదు. దీంతో గది తలుపులు మూసిఉండగా, ఖాళీ కురిచ దర్శనమిచ్చింది. దీనిపై కార్యాలయ సిబ్బందిని అడగగా.. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారని ఒకరు, సర్వే పరిశీలనకు వెళ్లారని మరొకరు పొంతనలేని సమాధానం చెప్పారు. ఎంపీడీవోను ఫోన్‌లో సంప్రదించగా తాను మంగళపర్తిలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలనకు వెళ్లానని తెలిపారు. దీంతో మంగళపర్తి గ్రామానికి వెళ్లి చూడగా, ఎంపీడీవో గ్రామానికి రాలేదని, పంచాయతీ కార్యదర్శితో పాటు సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు కోసం చేస్తున్న సర్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుకారిపోతుంది.

ఎన్‌ఎల్‌ఎం స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

- పశు సంవర్ధకశాఖ జేడీ వెంకట్‌రెడ్డి



దౌలాపూర్‌లో గొర్రెల షెడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ వెంకట్‌రెడ్డి

జగదేవ్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌ఎల్‌ఎం(నేషనల్ లైవ్ స్టాక్ మిషన్) స్కీంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ జేడీ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగదేవ్ పూర్ మండలంలోని దౌలాపూర్, దర్మారం గ్రామంలోని ఇద్దరి రైతులకు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం ద్వారా మంజూరైన షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎల్‌ఎం స్కీమ్ ద్వారా రైతులు గడ్డి పెంపకం, గొర్రెల పెంపకం, మేకల పెంపకం, పందుల పెంపకం వంటి కార్యక్రమాలను చేపట్టుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26 నుంచి పశుగణన వివరాలను యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. పశువులకు నూతన విధానం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడ దూడలు జన్మిస్తాయని తెలిపారు. గాలికుంటు, చిటుకు వ్యాధి నివారణకు పశువులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్ రమేష్, మండల అధికారి శ్వేత పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో జాప్యం చేస్తే యుద్ధమే

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

గజ్వేల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో జాప్యం చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల సమీక్షా సమావేశాన్ని ముంద్రాతి కృష్ణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరితో కలసి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఇప్పటికే 11062 టీచర్ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెర్క పరుశరాములు, మాసాయిపేట యాదగిరి, మైన రాములు, మల్లిగారి యాదగిరి, లింగంపల్లి శ్రీనివాస్, శనిగారి రమేశ్, ఉబ్బని ఆంజనేయులు, బుచ్చేంద్ర, యాదగిరి, పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన



భూముల రికార్డులు పరిశీలిస్తున్న శిక్షణా కలెక్టర్ మనోజ్‌కుమార్

జిన్నారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాయ్యపల్లిలో 166 సర్వే నంబరు భూములను శిక్షణా కలెక్టర్ మనోజ్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం గ్రామంలో పర్యటించిన ఆయన గతంలో అసైన్డ్‌మెంట్ కింద కేటాయించిన భూముల వివరాలను పరీక్షించి సేకరించారు. దీనికి సంబంధించిన రికార్డులను తహసీల్దార్ కార్యాలయంలో కూడా పరిశీలించారు. కొందరు రైతులు గతంలో తమకు కేటాయించిన అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కోసం దరఖాస్తు చేయగా.. అధికారులు పరిశీలన జరిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్‌ఐ జయప్రకాష్‌నారాయణ, మాజీ సర్పంచులు ప్రకాశంచారి, నీరుడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ యోగా శిక్షకుడిగా మద్దెల భరత్



నియామకపత్రాన్ని అందజేస్తున్న వైద్యురాలు

రామాయంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన యోగ శిక్షకుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రామాయంపేట ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు జాతీయస్థాయి యోగ ప్రదర్శన కారుడు మద్దెల భరత్‌ను యోగ శిక్షకుడిగా నియమించారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు

సంగారెడ్డి క్రైం/జిన్నారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్.భాస్కర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా జిన్నారం సీఐగా నయిమోద్దీన్, బొల్లారం సీఐగా రవీందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

నేడు వట్‌పల్లిలో ఉచిత కంటి శిబిరం

వట్‌పల్లి,నవంబరు 19.(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న వట్‌పల్లిలో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత (ఐవోఎల్) కంటి శుక్లాల శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పెద్దన్న, వైద్యసాగర్‌లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అపరాధ రుసుముతో 'పది' పరీక్షకు ఫీజు గడువు డిసెంబర్ 30

మాసాయిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరుగనున్న పదో తరగతి పరీక్షలకు గాను పరీక్ష ఫీజు గడువు ఈ నెల 28న ముగుస్తుండగా అపరాధ రుసుము రూ. 500 డిసెంబర్ 30 వరకు చెల్లించవచ్చని మాసాయిపేట మండల విద్యాధికారి లీలావతి తెలిపారు. 50 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబర్ 10 తేదీ వరకు, రూ. 200 అపరాధరుసుముతో 19 వ తేదీ వరకు పరీక్ష ఫీజులను చెల్లించవచ్చని, విద్యార్థులు గడువు లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని మండల విద్యాధికారి పేర్కొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్‌కు ఎంపిక



హన్మంతు

రాయికోడ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అండర్-14 జాతీయస్థాయి వాలీ బాల్ పోటీలకు రాయికోడ్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి హన్మంత్ ఎంపికయ్యారు. ఇటీవల చేగుంటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థిప్రతిభకు ప్రశంసాపత్రం అందజేసినట్లు మండల విద్యాధికారి వి.అంజయ్య తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

హత్నూర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గుండెపోటుతో మృతి చెందిన హిందీ పండిట్ భాస్కర్ ఆత్మకు శాంతి చేకూరాలని మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మంజుల, మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

మనూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. మండల పీహెచ్‌సీ పరిధిలో ఆశ వర్కర్లతో మనూరులో మంగళవారం సమావేశం నిర్వహించగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చినహామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కాగా సర్వేల పేరుతో అధికారుల వేధింపులు ఆపాలన్నారు. సమావేశంలో ఆశ వర్కర్లు ఎలీషా లక్ష్మి, సాయమ్మ, మంజుల, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను అరికట్టండి

సంగారెడ్డి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రాల్లో దళారీ వ్యవస్థను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలోని వ్యవసాయ శాఖ కార్యాలయ ఏవో రాహుల్‌కు మంగళవారం సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసినవారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, రైతులు ఉన్నారు.

కస్టోడియన్ భూములపై పేదలకు హక్కు కల్పించాలి

నర్సాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం లక్ష్మాపూర్ సమీపంలో ఉన్న వందలాది కస్టోడియన్ భూములను పేదలు సాగు చేసుకునే విధంగా హక్కు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం లక్ష్మాపూర్ ప్రాంతంలో ఉన్న కస్టోడియన్ భూములను మెదక్ జిల్లా కార్యదర్శి టీఎం ఖాలేక్, నాయకులు తదితరులతో కలిసి సందర్శించారు.

స్వయం ఉపాధికి సహకార సంఘాలు

నిజాంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధికి సహకార సంఘాలు ఎంతో దోహదపడతాయని పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం పేర్కొన్నారు. మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన బాజే కవితకు గొర్ల పెంపకంపై రుణం మంజూరు కాగా మంగళవారం ఆయన చేతులమీదుగా చెక్కును లబ్ధిదారుకు అందజేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వరద కాలువపై అపార్ట్‌మెంట్ల నిర్మాణం
- ప్రమాదకరంగా కోతకు గురైన కొల్లూరు-వెలిమెల రోడ్డు
- తరచూ చిన్నపాటి గాయాలతో బయటపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

రామచంద్రాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు- వెలిమెల రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. సుమారు మీటరు దూరం వరకు రోడ్డు కోతకు గురికాగా, మీటరుకు పైగా గుంత ఏర్పడింది. వర్షాకాలం ప్రారంభంలో ఇది జరిగినా సంబంధి అధికారులు రోడ్డు మరమ్మతులను చేపట్టలేదు. కాగా ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారులు ఈ సమస్య తమ పరిధిలోకి రాదంటూ చేతులు దులుపుకోవడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని అయోమయపరిస్థితి నెలకొన్నదని స్థానికులు మండిపడుతున్నారు. రోడ్డుపై ప్రమాదకరంగా గుంత ఏర్పడినప్పటికీ కనీసంప్రమాద హెచ్చరిక సూచికను కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఫలితంగా నిత్యం ఇక్కడ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయితే చిన్నపాటి గాయాలతో బయటపడటంతో బాధితులెవరు కూడా ఫిర్యాదులు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఊహించరాని పెద్ద ప్రమాదాలు జరగకముందే రోడ్డుకు మరమ్మతులకుచర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వరద కాలువ వత్తిడి

కొల్లూరు పెద్దచెరువు వరదనీరు ఇక్కడి కాలువ నుంచి తాళ్ల చెరువులోకి ఉధృతంగా ప్రవహిస్తుంది. చెరువు నుంచి వస్తున్న కాలువపై అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. ఇక్కడి బిల్డర్లు కాలువను మళ్లించడంవల్లే రోడ్డు కోతకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టును పునరుద్ధరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొల్లూరు-వెలిమెల రోడ్డుపై కోతకుగురైన దృశ్యం

ఆర్‌అండ్‌బీ శాఖకు లేఖ రాశాం

రోడ్డు, కిందపైపు కోతకు గురైన విషయం గురించి జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులకు లేఖ రాశాం. ఇక్కడ బాక్స్ కల్వర్టు నిర్మించాలని కోరాం. త్వరలోనే పెద్ద చెరువు నుంచి వస్తున్న కాలువను సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం.

- సంతోషిణి, ఇరిగేషన్ ఏఈ

మరుగుదొడ్ల వినియోగంతో పరిసరాలు పరిశుభ్రం




నర్సాపూర్: గూడెంగడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపుకలెక్టర్ నగేష్

నర్సాపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మించి వాటినే వినియోగించుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గూడెంగడ్డలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపుకలెక్టర్ నగేష్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, డీపీవో యాదయ్య, జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుధ్య కార్మికులను అధికారులు శాలువాతో సత్కరించారు. గ్రామంలో శుభకార్యక్రమాలకు గానూ ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా స్టీలు బ్యాంకును అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, ఏపీవో అంజిరెడ్డి, ఏపీఎం గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- నిజాంపేట/కల్హేర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మన మరుగుదొడ్డి మన ఆత్మగౌరవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో మల్సూర్ నాయక్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మం,ఈజీఎస్ ఏపీవో బస్వరాజ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దివంగత ప్రధాని ఇందిర సేవలు చిరస్మరణీయం



నారాయణఖేడ్‌లో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్/కంది/రాయికోడ్/శివ్వంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్‌లోని తన స్వగృహ ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, న్యాయవాది బోజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఖేడ్‌పరిధిలోని నిజాంపేట మండలం బాచేపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో శుభ్రత, కూరగాయలు, సరుకులను పరిశీలించారు. కంది మండలంలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆయుధ కర్మాగారంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయుధ కర్మాగారంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసాల మల్లారెడ్డి, అన్ని యూనియన్ల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. రాయికోడ్ మండల పరిధిలోని సింగితం గ్రామంలో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీజయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు బాలయ్య, వీరేశం, రఫీక్, రాజు, మూసమొగులయ్య, తదితరులు ఉన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కల చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన గౌడ్, నాయకులు వెంకటేష్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి సొసైటీలో ఫిర్యాదుల పెట్టె



మాజీ ఎండీలు, అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

పాపన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ చైర్మన్ త్యార్ల రమేష్ తెలిపారు. 71వ సహకార సంఘ వారోత్సవాల సందర్భంగా మంగళవారం సొసైటీ మాజీ మేనేజింగ్ డైరక్టర్లు, జిల్లా కో ఆపరేటివ్ అధికారులు, రిటైర్డ్ సొసైటీ ఉద్యోగులు తదితరులతో సమన్వయ సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి సొసైటీ కార్యాలయంలో రైతు ఫిర్యాదులపెట్టె ఏర్పాటు చేసి, 15 రోజులకోసారి ఇద్దరు డైరెక్టర్లు, సొసైటీ అధికారుల సమక్షంలో తెరిచి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎండీలు, రిటైర్డ్ ఉద్యోగులు అధికారులను చైర్మన్ రమేష్ సన్మానించారు.

పీజీలో ప్రవేశాలకు నేడు ఆఖరు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల పీజీ సెంటర్‌లో మిగిలిన పీజీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ దరఖాస్తుల స్వీకరణ చివరి గడువు అని పేర్కొన్నారు. పీజీ వివిధ విభాగాల్లో మిగిలిన సీట్లలో అడ్మిషన్లు పొందేందుకు డిగ్రీ టీసీతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు ఫోటోలు, ఒక జిరాక్స్ సెట్‌తో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9441069020 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డిప్లొమా కోర్సుల్లో ..

సంగారెడ్డి అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పారా మెడికల్ బోర్డు సెక్రటరీ జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధామాధురి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, డిప్లొమా ఇన్‌మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాలకు 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

అరుదైన శస్త్రచికిత్సతో 'మోకాలి మార్పిడి'



శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని జ్యోతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకాలి మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన రాములు(72) కొన్ని నెలలుగా మోకాలి నొప్పి కారణంగా నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. రాములు స్థానిక జ్యోతి హాస్పిటల్‌ను సంప్రదించగా పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతడికి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డా.బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో మోకాలి మార్పిడికి అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు సంజయ్, వెంకట్, జ్యోతిర్మయి, చక్రపాణి పాల్గొన్నారు.

బల్దియాలో బడ్జెట్ నిల్...

(5వ పేజీ తరువాయి)

మాత్రం ఉదారంగా వ్యవహరిస్తుండడం మూలంగా కోట్లాది రూపాయల బకాయిలు పేరుకుపోయాయి.

ప్రభుత్వ భవనాల బకాయిలు కోట్లలో

ప్రభుత్వ కార్యాలయ భవనాల ఆస్తిపన్ను బకాయిలు కోట్లకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు భవనం పన్ను బకాయి రూ. 1.62 కోట్లు పెండింగులో ఉంది. బీఎస్ఎన్ఎల్ భవనం పన్ను రూ.86.9 లక్షలు, హెడ్ పోస్టాఫీస్ భవనం టాక్స్ రూ. 78.75 లక్షలు. ఎమ్మార్వో కార్యాలయం టాక్స్ రూ. 27.71 లక్షలు, పంచాయతీరాజ్ కార్యాలయం రూ.21.86 లక్షలు, విద్యుత్‌శాఖ కార్యాలయం రూ.19 లక్షలు, ఆర్డీవో కార్యాలయ భవనం రూ.8.7 లక్షలు, జడ్జి క్వార్టర్స్ రూ.19.17 లక్షలు, రోడ్లు భవనాలశాఖ కార్యాలయ భవనం రూ. 25.82 లక్షలు బకాయి ఉన్నట్లు మున్సిపల్ ఆర్ఐ పేర్కొన్నారు. ప్రవేటు ప్రాపర్టీ టాక్స్ వసూలులోనూ బల్దియా వెనుకబడింది. ఈ ఏడాది రూ.5 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యం కాగా, కేవలం రూ.2 కోట్లు మాత్రమే వసూలయ్యాయి.

జీతాలు చెల్లించలేని దుస్థితి

సిబ్బందికి నెలనెలా జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో మెదక్ మున్సిపాలిటీ ఉంది. మున్సిపాలిటీలో శానిటేషన్ కార్మికులు 78 మంది, విలీన గ్రామాలు, ఇతర విభాగాల్లో 50, నీటి సరఫరా సిబ్బంది, వీధి దీపాల నిర్వహణకు 71 మంది, ఏజెన్సీ (కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు) సిబ్బందికి ప్రతీ నెల రూ.37 లక్షలు వేతనాల కింద చెల్లిస్తున్నారు. జనరల్‌ఫండ్ కేవలం రూ.10 లక్షలు మాత్రమే ఉన్నట్లు అకౌంట్స్ విభాగం ఉద్యోగి తెలిపారు. ఖజానాలో డబ్బులు లేక విద్యుత్ బిల్లు బకాయి పేరుకుపోయింది. పది నెలలుగా విద్యుత్ శాఖకు రూ. కోటి చెల్లించాల్సి ఉంది. ఆస్తిపన్ను వసూలులో అలసత్వాన్ని వీడి బల్దియా సిబ్బంది చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే పురోగతి సాధించే అవకాశం ఉంది.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



నర్సాపూర్: చిన్నచింతకుంట కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పీడీ

టేక్మాల్/పెద్దశంకరంపేట/రేగోడు/నర్సాపూర్/మనోహరాబాద్/పాపన్నపేట, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని మెదక్ జిల్లా డీసీవో కరుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ధాన్యం బస్తాల లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి సంబంధిత మిల్లులకు తరలించాని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట డీసీఏవో కరుణాకర్, సీవో శివకుమార్ ఉన్నారు. పెద్దశంకరంపేట పట్టణ శివారులోని సబ్‌మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల తహసీల్దార్ గ్రేస్ బాయ్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రైతులతో వరిధాన్యం కొనుగోలు పట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రేగోడులో ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ నరేష్ పరిశీలించారు. రేగోడు మండలంలోని రేగోడు, కొత్వాల్‌పల్లి, చౌదరిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్ ఎంట్రీ, రైతులకు చెల్లింపు వివరాలు, లారీలు వస్తున్న తీరుపై ఆరా తీశారు. మనోహరాబాద్ మండలం దండుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడి పరిశీలించారు. పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూరు గ్రామంలో కొత్తపల్లి రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తోపాటు కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్తా, మాజీ జడ్పీటీసీ మల్లప్ప ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

మునిపల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండలం చింతల్‌గట్టు గ్రామానికి చెందిన బేగరి రాములు, మండల పరిధిలోని పెద్దగోపులారం గ్రామానికి చెందిన బస్వరాజ్ తమ విలువైన సెల్ ఫోన్‌లు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మునిపల్లి పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్ ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ మంగళవారం సెల్‌ఫోన్‌లను బాధితులకు అందజేశారు.

గ్రంథాలయంలో మహిళా దినోత్సవం



గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం సంస్థ చైర్మన్ అంజయ్య, కార్యదర్శి వసుంధర అధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ రకాల పోటీల్లో పాల్గొని విజయం సాధించిన బాలబాలికలు, విద్యార్థులకు బహుమతులు ప్రదాన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, డిప్యూటీ గ్రంథపాలకుడు వంశీకృష్ణ, సహాయ గ్రంథపాలకుడు శ్రీనివాస్, ప్రశాంత్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వసతులు



వెల్దుర్తి పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

వెల్దుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వసతులు కల్పించి ప్రసవాలను పెంచడమే లక్ష్యమని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. మంగళవారం వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి స్థానిక వైద్యాధికారులతో, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు లక్షల మంది టీబీ వ్యాధి బారిన పడినట్లు గుర్తించామని, వారికి వ్యాక్సిన్ వేయనున్నట్టు తెలిపారు. అలాగే 100టీబీ సైతం ప్రారంభమైందన్నారు. ఆర్‌ఎంపీలు ఎవరైనా నిబంధనలు అతిక్రమించి చికిత్స నిర్వహిస్తే కేసులు నమోదు చేసి, ఆర్‌ఎంపీ కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సృజన, ఆరోగ్య కేంద్రం వైద్యులు సౌజన్య, శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీడీఎస్ మహిళారైతులకు ప్రతిభా పురస్కారాలు



హైదరాబాద్‌లో డీడీఎస్ మహిళారైతులకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

జహీరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో గల డీడీఎస్(డెక్కన్ డెవలప్‌మెంట్‌సొసైటీ)కు చెందిన మహిళారైతులకు మంగళవారం హైదరాబాద్‌లో ప్రతిభాపురస్కారాలను అందజేశారు. రాష్ట్రప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా వ్యవసాయరంగంలో విశేష సేవలందిస్తున్నవారికి హైదరాబాద్‌లో ప్రతిభ పురస్కారాలను అందజేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌చైర్మన్ కోదండరెడ్డిల చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందజేసినట్లు డీడీఎస్ మహిళారైతులు పేర్కొన్నారు. అందులో భాగంగ బిడెకన్నె జడలచంద్రమ్మ, మొట్లకుంట సూర్యకళ, అర్జున్‌నాయక్‌తండాకు చెందిన చాందిబాయి, తదితరులకు ఇందిరాగాంధి వ్యవసాయ ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

వరికోతల తర్వాత అవశేషాలను కాల్చొద్దు

నర్సాపూర్/నిజాంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వరికోతలు పూర్తయిన తర్వాత పొలల్లో మిగిలిపోయే అవశేషాలను కాల్చకుండా డీకంపోస్ చేయాలని నర్సాపూర్ వ్యవసాయశాఖ ఏడీఏ సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలో వరికోతలు పూర్తయిన పొలాలను ఏడీఏ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోతలు పూర్తయిన తర్వాత రైతులు అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణం కాలుష్యమవుతుందన్నారు. ఎస్ఎస్‌పీ, యూరియాను ఉపయోగించి డీకంపోస్ చేయడం వల్ల పర్యావరణానికి, భూమికి మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా పంట దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి సందర్శించి వరి కొయ్యలను కాల్చడం వలన జరిగే నష్టాలను రైతుల వివరించారు.

మండలంలో 94 శాతం సర్వే పూర్తి: ఆర్డీవో

మనోహరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో సమగ్ర ఇంటింటి సర్వేను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో 446 కుటుంబలకు గాను సర్వే పూర్తి చేసినందుకు సర్వే సిబ్బంది లక్ష్మీ, భవాని, సత్యనారాయణ, ఎన్యూమరేటర్లను సన్మానించారు. అలాగే మండల కేంద్రంలో సుమారు 94 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేశారని తెలిపారు.

కుల గణన ఎన్యూమరేటర్లకు శిక్షణ

కల్హేర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని కుల గణన సూపర్‌వైజర్లు ఎన్యూమరేటర్లకు మంగళవారం సిర్గాపూర్ ఎంపీపీ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. కుల గణన కార్యక్రమంలో పాల్గొన్న సూర్‌వైజర్లకు, ఎన్యూరేటర్లకు కంప్యూటర్ ఆపరేటర్ రవి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిర్గాపూర్ ఎంపీడీవో మల్సూర్ నాయక్, తహసీల్దార్ ఉమాశంకర్, ఎంఈవో నాగారం శ్రీనివాస్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'రంగోత్సవ్'లో విద్యార్థుల ప్రతిభ

వెల్దుర్తి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గతనెలలో వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి రంగోత్సవ్ సెలబ్రెషన్స్ ఆర్ట్‌లో 35 మంది విద్యార్థులు పాల్గొనగా, 18 మంది ప్రతిభను కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. ఈపోటీలకు సంబంధించిన ఇంచార్జి ఉపాధ్యాయురాలు సీహెచ్ జయసుధను మంగళవారం స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు.

రేపు మనూరులో దర్గా ఉర్సు

మనూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్ షాదుల్లా హుస్సేని దర్గా ఉర్సు నిర్వహిస్తున్నామని మనూరు గ్రామస్థులు మంగళవారం తెలిపారు. ఈ నెల 21న గురువారం గంధాల ఊరేగింపు, 22న శుక్రవారం జాతర, దీపారాధన, ఖవాలి, 23న శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామస్థులు కోరారు.